JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శుక్రవారం 30-01-2026
Medchal - Malkajgiri | Friday 30-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 244
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 244 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





## జనం మధ్యకు సమ్మక్క

- జాతరలో అత్యంత ప్రధానమైన ఘట్టం సమ్మక్క అమ్మవారి ఆగమనం
- అమ్మవారు గుట్ట దిగే సమయంలో జిల్లా ఎస్పీ ఏకే 47 తుపాకీతో గాలిలోకి కాల్పులు
- కోట్లాది భక్తుల ఆరాధ్య దైవాలైన వనదేవతల కొలువు


**జయభేరి, వరంగల్, జనవరి 29 :**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర మేడారం సమ్మక్కసారలమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. కోట్లాది భక్తుల ఆరాధ్య దైవాలైన వనదేవతల కొలువుతో ములుగు జిల్లాలో ఉన్న అటవీప్రాంతం జనసంద్రమైంది. జనవరి 28 బుధవారం సాయంత్రం సారలమ్మ గద్దెపై కొలువు దీరడంతో జాతరకు అంకురార్పణ జరిగింది. భక్తుల జయజయధ్వానాలు, ఆదివాసీ వాయిద్యాల హోరు మధ్య మేడారం పులకించిపోయింది. మేడారం జాతర ప్రారంభానికి వారం ముందు నుంచే మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు..



2 లో

# కేసీఆర్ కు సిట్ నోటీసులు



- CRPC 160 ప్రకారం ఆయనకు నోటీసులు
- ప్రతిపక్షనేతలు, వ్యాపారవేత్తలు, పాత్రికేయులు, న్యాయమూర్తులు, సెలబ్రెటీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేశారన్న హరీష్
- ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య
- ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ
- కేసీఆర్‌కు నోటీసుల విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**జయభేరి, హైదరాబాద్, జనవరి 29 :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ SIT మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే BRS పార్టీ ముఖ్యనేతలను విచారించిన SIT, ఇప్పుడు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించనుంది. CRPC 160 ప్రకారం ఆయనకు నోటీసులు జారీ చేశారు.

2 లో

## పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

- గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు
- తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి.. ఉప ముఖ్యమంత్రి భట్టి



**జయభేరి, హైదరాబాద్ :**

పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి వుంటుంది. తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం జరిగిన గాలి నాణ్యత సూచీ, గాలి నాణ్యత నిర్వహణపై సదస్సులో అయన ప్రసంగించారు. భట్టి మాట్లాడుతూ.. నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు వుంటాయి. గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం. త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు


...మిగతాది 2 లో



## ఫిబ్రవరి 14న ఏపీ బడ్జెట్

**జయభేరి, విజయవాడ, జనవరి 29 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. సుమారు నెల రోజుల పాటు, అంటే మార్చి 12 వరకు ఈ సమావేశాలు అత్యంత సుదీర్ఘంగా సాగనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టబోతున్న పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ కావడంతో, దీనిపై అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజానీకంలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. సమావేశాల తొలి రోజైన ఫిబ్రవరి 11న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్తు ప్రణాళికలు, గత ఏడాది సాధించిన విజయాలను ప్రభుత్వం వివరించనుంది.రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలిచే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రధాన బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున సాగు రంగం కోసం ప్రత్యేకంగా రూపొందించిన వ్యవసాయ బడ్జెట్ ను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమర్పించనున్నారు. ఉమ్మడి బడ్జెట్ తో పాటు వ్యవసాయ బడ్జెట్‌ను కూడా అదే రోజు ప్రవేశపెట్టడం ద్వారా రైతాంగానికి ఇచ్చే ప్రాధాన్యతను ప్రభుత్వం చాటనుంది. ముఖ్యంగా ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపులు, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులకు నిధుల సర్దుబాటు ఈ బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉండనున్నాయి. కేవలం ఆర్థిక లెక్కలకే పరిమితం కాకుండా, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలతో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సుమారు 30 రోజుల పాటు సాగే ఈ బడ్జెట్ కసరత్తులో వివిధ శాఖల పద్దులపై చర్చలు, ప్రభుత్వ బిల్లుల ఆమోదం వంటి కార్యక్రమాలు ఉంటాయి.



## రెండు జిరాఫీలను దత్తత తీసుకున్న పవన్

- తల్లి అంజనా దేవి జన్మదినోత్సవం సందర్భంగా జూ పార్క్ లోని రెండు జిరాఫీలను ఏడాదిపాటు దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు

**జయభేరి, విశాఖపట్నం :**

ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్నం పర్యటనలో భాగంగా గురువారం నాడు ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలను పరిశీలించారు. తల్లి అంజనా దేవి జన్మదినోత్సవం సందర్భంగా జూ పార్క్ లోని రెండు జిరాఫీలను ఏడాదిపాటు దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. రెండు జిరాఫీలకు ఏడాదిపాటు అయ్యే ఖర్చు మొత్తం భరించనున్నట్టు ప్రకటిచారు. జంతు సంరక్షణకు కార్పోరేట్

...మిగతాది 2 లో

## కులగణన విషయంలో మాట తప్పిన బీజేపీ

- కల్వకుంట్ల కవిత

**జయభేరి, హైదరాబాద్ :**

దేశ వ్యాప్తంగా జనగణన, కులగణన పై ఎక్సర్ సైజ్ జరుగుతోంది. నిజానికి పదేళ్ల కు ఒకసారి జనగణన చేయాలి. 2021 లో జనగణన చేయాల్సి ఉండే.కానీ కోవిడ్ కారణంగా జనగణన చేయలేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం బంజారాహిల్స్ ఖాజా మాన్షన్ లో జరిగిన జాతీయ జన గణనలో కులగణన సమగ్ర చర్చ రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె మాట్లాడారు. కవిత మాట్లాడుతూ ఐతే కులగణన పై అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ రావటంతో కేంద్రం అందుకు అంగీకరించింది. నిజానికి కులగణన చేయాలన్న బుద్ధి బీజేపీ రావటం మమ్మల్ని ఆశ్చర్యపరించింది. జనగణన చేసినప్పుడే ఏ వర్గం ఎంత ఉంది? వారికి బడ్జెట్, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయన్నది తెలుస్తుంది.



2 లో



## యూజీసీ నిబంధనలలో స్పష్టత లేదు

- స్టే విధించిన సుప్రీంకోర్టు.. కేంద్రానికి కీ ఆదేశాలు..!

**జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 29 :**

సుప్రీంకోర్టు కొత్త UGC నిబంధనలను నిలిపివేసింది. ప్రాథమికంగా చూస్తే, నిబంధనల భాషలో స్పష్టత లేదని అనిపిస్తోందని భారత అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దుర్వినియోగాన్ని నిరోధించడానికి భాషను మెరుగుపరచడానికి దర్యాప్తు అవసరమని తెలిపింది. యూజీసీ నిబంధనలను తిరిగి రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు కొత్త UGC నిబంధనలను నిలిపివేసింది. ప్రాథమికంగా చూస్తే, నిబంధనల భాషలో స్పష్టత లేదని అనిపిస్తోందని భారత అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దుర్వినియోగాన్ని నిరోధించడానికి భాషను మెరుగుపరచడానికి దర్యాప్తు అవసరమని తెలిపింది. యూజీసీ నిబంధనలను తిరిగి రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటి వరకు, పాత 2012 నిబంధనలు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## జనం మధ్యకు సమ్మక్క

జాతర మొదటిరోజు సారలమ్మ రాకను చూసి తరించేందుకు పిల్లాపాపలతో తరలివచ్చారు. కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో ఉదయం నుంచే పూజలు నిర్వహించారు... సాయంత్రం వేళ అమ్మవారి ప్రతిరూపమైన పసుపు, కుంకుమలను మొంటెలో (వెదురు బుట్ట) ఉంచి మేడారానికి తీసుకొచ్చారు. సోలం వెంకటేశ్వర్లు పట్టిన హనుమాన్ జెండా నీడన అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రతువులో 'వరం పట్టడం' అనే భక్తి ప్రక్రియ ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవాలి. సంతాన భాగ్యం కోసం, కోరిన కోర్కెలు నెరవేరేందుకు మహిళలు ఆలయ మెట్ల నుంచి సుమారు వంద మీటర్ల మేర భూమిపై మోకరిల్లుతారు.. అమ్మవారిని మోస్తున్న పూజారులు వారిపై నుంచి నడుచుకుంటూ వెళ్లిన దృశ్యం భక్తులను పులకింపజేసింది. దారంతా కోళ్లను బలిస్తూ వనదేవతలకు స్వాగతం పలికారు. జంపన్నవాగుదాటుకుని మేడారం చేరుకుని... అప్పటికే సిద్ధంగా ఉన్న పగిడిద్దరాజు, గోవిందరాజులతో కలిసి సారలమ్మను గద్దె పైకి తీసుకొచ్చారు. సమ్మక్క భర్త పగిడిద్దరాజు గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పెళ్లికొడుకుగా ముస్తాబై కాలినడకన అడవి మార్గంలో మేడారానికి చేరుకున్నారు. జాతర మొదటి రోజు ఉదయానికే మేడారం చేరుకున్న పగిడిద్దరాజు... ఆలయం వద్ద సమ్మక్క రాకకోసం వేచి చూశారు. సాధారణంగా మొదటి రోజు సాయంత్రానికి సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును ప్రతిష్టిస్తారు.. కానీ ఈ ఏడాది అనుకోని కారణాలతో ఆలస్యంగా గద్దెలపైకి చేరారు. రాత్రి 12 దాటిన తర్వాత దేవాదాయ శాఖ అధికారులు విద్యుత్ దీపాలను నిలిపివేసి, అత్యంత రహస్యంగా క్రతువును పూర్తి చేశారు. జాతరలో అత్యంత ప్రధానమైన ఘట్టం సమ్మక్క అమ్మవారి ఆగమనం జనవరి 29 గురువారం జరగనుంది. సాయంత్రం 5 గంటల సమయంలో చిలకలగుట్టపై ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య ఆధ్వర్యంలో రహస్యంగా పూజలు నిర్వహించి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను వెదురు బొంగులో భద్రపరిచి తీసుకొస్తారు. అమ్మవారు గుట్ట దిగే సమయంలో జిల్లా ఎస్పీ ఏకే 47 తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపి అధికారికంగా స్వాగతం పలుకడం, ఎదురుకోళ్ల మండపం వద్ద మేడారం ఆడబిడ్డలు అమ్మవారికి నీళ్లతో స్వాగతం పలకే దృశ్యాలు భక్తులను పూనకంలో ముంచెత్తుతాయి. గురువారం రాత్రికి సమ్మక్క కూడా గద్దెపై కొలువుతీరిన తర్వాత వనదేవతలను భారీగా భక్తులు దర్శించుకుంటారు. మేడారం జాతర రద్దీని దృష్టిలో ఉంచుకుని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర.. గురువారం నాడు జిల్లావ్యాప్తంగా స్థానిక సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భక్తుల రక్షణ కోసం సుమారు 13 వేల మంది పోలీసులు, 40 వేల మంది వివిధ శాఖల సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జాతర మొదటి రోజే ఆర్టీసీ ఏర్పాటు చేసిన 50 ఎకరాల ప్రయాణ ప్రాంగణం బస్సులతో నిండిపోగా, ప్రైవేటు వాహనాల కోసం కేటాయించిన 1,462 ఎకరాల పార్కింగ్ స్థలం కూడా సరిపోలేదు. ఇక సమ్మక్క తల్లి గద్దెపైకి రాకతో ఈ రద్దీ మరింత పెరుగుతుంది.

## పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

వెళుతుందని అన్నారు. నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు. అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు. సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు, ఇది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు, అది ప్రజారోగ్య సూచీ, అది ఉత్పాదకత సూచీ మరియు అది ఆర్థిక సూచీ కూడా అన్నారు. 2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం, కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

## మాట తప్పిన బీజేపీ

కులగణనకు కేంద్రం ముందుకు రావటంతో సంతోషించాం. కానీ ఎప్పుడైతే డాక్యుమెంట్ విడుదల చేశారో అప్పుడే వాళ్ల బుద్ధి బయట పడింది. ఎస్సీ, ఎస్టీ ల కాలం పెట్టారు. ఓబీసీ లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్ లో పెట్టారు. దీని ద్వారా భారతీయ జనతా పార్టీ...భారత ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. కులాల విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా కులాలను పిలుస్తారు. నన్నే తీసుకుంటే నేను వెలమ. తెలంగాణలో ఓసీ, మహారాష్ట్రలో ఎస్సీ, ఏపీ లో బీసీని. చిన్న సంఖ్యలో ఉన్న కులానికే ఇన్ని వైరుధ్యాలు ఉన్నాయి. మరి 56 శాతం ఉన్న బీసీల విషయంలో ఎంత గందరగోళం ఉంటుందో ఆలోచించాలి. గతంలో అగ్ర కులాల్లో పేదలకు రిజర్వేషన్లు ఇచ్చారు. వాళ్లు ఏ కేటగిరీలో వస్తారో చెప్పలేదు. ఇవ్వాళ మన రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని కమ్యూనిటీల వాళ్లు వచ్చారు. మనం ఇచ్చే అభిప్రాయం రిజర్వేషన్ల విషయంలో కేంద్రానికి సూచికలా ఉండాలి. బీజేపీ కులగణన విషయంలో ఇచ్చిన మాట తప్పినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అన్ని రాష్ట్రాల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. తెలంగాణ నుంచి మన అభిప్రాయం కూడా ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాం. తెలంగాణలో ఉన్న కులాలు, వాటి ఉపకులాల నివేదిక జాగృతి సిద్ధం చేస్తుంది. నిజానికి ఈ పని ప్రభుత్వమే చేయాలి. కానీ వాళ్లకు చిత్తశుద్ధి లేదు. అందుకే మేము అందరినీ ఒపీనియన్స్ తీసుకోవాలని నిర్ణయించాం. తెలంగాణ థింక్స్, ఇండియా ఫాలోస్ నెక్స్ అనే విధంగా మనం ఉంటాం. కులగణన విషయంలోనూ మనం అదే విధంగా నివేదికను కేంద్రానికి ఇద్దాం. ప్రతి కులానికి అన్ని హక్కులు సాధించుకునేలా ప్రయత్నం చేద్దాం. ఇలాంటి అంశంలో రాజకీయ పార్టీల పాత్ర కీలక. కచ్చితంగా ఈ అంశంపై ప్రతి పార్టీకి ఒక స్టాండ్ ఉండాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఈ విషయంలో ఏమీ మాట్లాడటం లేదు. కాంగ్రెస్ పరిస్థితి అంతే. బీజేపీయే డాక్యుమెంట్ విడుదల చేసింది. కనుక వాళ్లు ఆ డాక్యుమెంట్ గా మద్దతుగా మాట్లాడుతున్నారు. కానీ అన్ని పార్టీలు కూడా తమ స్టాండ్ ఏంటో చెప్పాల్సిందేనని అన్నారు.

## రెండు జిరాఫీలను దత్తత..

సంస్థలు ముందుకు రావాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.. జూ పార్క్ లో నూతనంగా నిర్మించిన ఎలుగుబంట్ల ఎన్ క్లోజర్ ను ప్రారంభించారు. జూపార్క్ లోని నీటి ఏనుగులు, నల్ల ఎలుగుబంట్లు, పులులు, సింహాల ఎంక్లోజర్ల వద్దకు వెళ్లి వాటికి అందించే ఆహారం, వాటి పేర్లు తదితర వివరాలు జూ క్యూరేటర్ ని అడిగి తెలుసుకున్నారు. ఏనుగులు, జిరాఫీల శాలలను పరిశీలించి వాటికి స్వయంగా ఆహారం అందించారు. జంతు శాలల్లో ఆహారం అందించేందుకు వెళ్లే సమయాల్లో జూ నిబంధనలు పాటించారు. కంబాలకొండ ఎకో పార్క్ లో నగర వనాన్ని ప్రారంభించారు. ఎకో పార్క్ లోని చెక్క వంతెనపై కనోపీ వాక్ చేశారు. మార్గం మధ్యలో మొక్కల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ధనవంతుల ఆస్తిగా బంగారం మారుతుందా..



పెరుగుతున్న బంగారం ధరలు సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నాయ్. బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల ఆస్తిగా మారే సమయం వస్తుందని ఋషి బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారన్నది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మాట. బంగారం ధరల ఈ పెరుగుదల ఇంకా ఎంతకాలం కొనసాగుతుంది? ఈ పెరుగుదల వెనకున్న కారణాలేంటి? ప్రస్తుతం బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బంగారం ధరలు సామాన్యులకు అందనంతగా పెరుగుతున్నాయని బ్రహ్మంగారు చాలా కాలం క్రితమే అంచనా వేశారు.భారతీయ సమాజానికి బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు ఇది సంప్రదాయం, విశ్వాసం , శుభంతో కూడా ముడిపడి ఉంది. " బంగారం ఎప్పుడూ దుమ్ముగా మారదు " అని ఒక సామెత ఉంది. అందుకే ప్రజలు బంగారాన్ని కేవలం ఆభరణాలుగా లేదా లోహంగా మాత్రమే కాకుండా పెట్టుబడిగా మన్నికైన ఆస్తిగా కూడా చూస్తారు. శతాబ్దాలుగా బంగారాన్ని సాంప్రదాయ ఆర్థిక వస్తువుగా పరిగణిస్తున్నారు. భారతీయ సంప్రదాయం, హిందూ సంస్కృతిలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. మంగళ సూత్రాలు, గాజులు ధరించడం భారతీయ వివాహిత మహిళల విశ్వాసం. ఇటీవల బంగారం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.బంగారం మెరుపు ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది, కానీ ఈ రోజుల్లో, దాని ధరలు నిరంతరం పెరుగుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. బంగారం ధరలు ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. కానీ బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల సొత్తుగా మారే సమయం వస్తుందని బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారట. ప్రస్తుత బంగారం ధరను చూస్తే, బ్రహ్మంగారు మాటలు ఇప్పుడు చాలావరకు నిజమయ్యాయనే చెప్పుకోవాలేమోచాలా సంవత్సరాల క్రితం కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దక్షిణ భారతదేశానికి గొప్ప జ్ఞాని , దార్శనికుడిగా భావిస్తారు. బంగారం ధరతో సహా ఆయన అంచనాలు చాలా క్రమంగా నిజమవుతున్నాయి. బంగారం ధర చాలా పెరుగుతుందని, మహిళలు బంగారానికి బదులుగా ఇతర, చౌకైన పదార్థాలతో తయారు చేసిన నగలను ధరించడం ప్రారంభిస్తారని బ్రహ్మంగారు ముందే అంచనావేశారు. అప్పట్లో ఇది సాధ్యమయ్యేపనేనా? ఇదొక ఊహ మాత్రమే అనిపించినా ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అలానే ఉంది. బంగారం కొనుగోళ్లు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. పెరుగుతున్న బంగారం ధరలు ఇప్పుడు వివాహాలు, పండుగలు , సాంప్రదాయ షాపింగ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా, ప్రజలు ఇప్పుడు తక్కువ బరువు లేదా ఇతర లోహాలతో తయారు చేసిన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. బంగారం ధర పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం, 24 క్యారెట్ల బంగారం ధర ₹1,62,100, 22 క్యారెట్ల బంగారం ధర ₹1,48,600, 18 క్యారెట్ల బంగారం ధర ₹1,21,610. నగరం , రోజును బట్టి ధరల్లో చిన్న చిన్న మార్పులుంటాయపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో భవిష్యత్ గురించి చాలా అంశాలు పద్యాలు, వచనాల రూపంలో చెప్పారు. అయితే బంగారం గురించి నేరుగా, స్పష్టంగా ధరలు పెరగడం గురించి ప్రత్యేకంగా లేదనే వాదనలు ఉన్నాయి. వాస్తవానికి బంగారం, ధరలు అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధానాలు స్టాక్ మార్కెట్‌లో అనేక ఒడిదొడుకులకు కారణమయ్యాయి. ఫలితంగా, పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి లోహాలపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నారు.వెనెజ్వెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత బంగారం ధరలు పెరిగాయి. అలాగే, ఇరాన్ నిరసనకారులను హింసాత్మకంగా అణచివేస్తున్నారంటూ ట్రంప్ ఆ దేశ ప్రభుత్వంపై బెదిరింపులకు దిగారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి కూడా ప్రస్తావించారు.సుంకాలు విధిస్తామంటూ యూరోపియన్ యూనియన్ దేశాలపై కూడా ఆయన బెదిరింపులకు దిగారు. వైట్‌హౌస్ నుంచి కొనసాగుతున్న ఈ అనిశ్చితి మార్కెట్లను భయాందోళనకు గురిచేస్తోంది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తే 100 శాతం సుంకాలు విధిస్తామంటూ గత శనివారం డోనల్డ్ ట్రంప్ కెనడాను హెచ్చరించారు. అయితే, తమకు అలాంటి ఉద్దేశం లేదని కెనడా ఆ తర్వాత పేర్కొంది.ఇవన్నీ పెట్టుబడిదారులను భయాందోళనకు గురిచేశాయి. ప్రపంచంలో ఏవైనా యుద్ధాలు, దురాక్రమణ, రాజకీయంగా భారీ ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ప్రజలు తమ డబ్బును స్టాక్ మార్కెట్ లేదా అలాంటి ఇతర ప్రమాదకరమైన ఆస్తుల నుంచి వెనక్కుతీసుకుని.. బంగారం వంటి సంప్రదాయ, సురక్షిత ఆస్తులవైపు మళ్లించేందుకు మొగ్గుచూపుతారు.ఈ అనిశ్చితి, ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గుచూపారు. ఈ మొగ్గు బంగారం డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలు వేగంగా పెరగడానికి కారణమైంది.అలాగే, 2025లో ట్రంప్ చాలా దేశాలపై సుంకాలు విధించిన సమయంలోనూ పెట్టుబడిదారులు "సురక్షిత పెట్టుబడులకు" మళ్లారు. ఫైనాన్షియల్ మార్కెట్లు నష్టాల బాటపట్టినా కూడా తమ పెట్టుబడుల విలువ తగ్గకుండా నిలుపుకునే ఆస్తులను "సురక్షిత పెట్టుబడులు" (సేఫ్ హెవెన్స్)గా వ్యవహరిస్తారు. క్లిష్టతర పరిస్థితుల్లోనూ వీటి విలువ పెరుగుతుంటుంది.సాధారణంగా, అమెరికన్ డాలర్ బలహీనపడితే.. బంగారం ధరలు పెరుగుతాయి.

ఎందుకంటే, బంగారం క్రయవిక్రయాలు డాలర్లలో జరుగుతాయి. డాలర్ బలహీనపడితే, ఇతర దేశాల్లో బంగారం ధరలు తగ్గుతాయి. కాబట్టి, కొనుగోళ్లు పెరుగుతాయి. ఇది డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలనూ పెంచుతుంది.ద్రవ్యోల్బణం, లేదా ఆర్థిక అనిశ్చితి కారణంగా డాలర్ బలహీనపడుతుంటుంది. అలాంటి సమయాల్లో, ప్రజలు బంగారాన్ని సురక్షిత మార్గంగా భావిస్తారు.వాటికితోడు.. బలహీనమైన డాలర్, అమెరికాలోని తక్కువ వడ్డీరేట్లతో కలిపి బంగారంపై పెట్టుబడులు పెట్టడం తక్కువ రిస్క్ కలిగిస్తుంది. డాలర్ నుంచి దూరం జరగడమే బంగారం ధర పెరుగుదలకు దారితీసినట్లు అనలిస్టులు భావిస్తున్నారు.యెన్(జపాన్ కరెన్సీ)ను బలపరచడంలో అమెరికా, జపాన్ ప్రయత్నాలతో డాలర్ బలహీనపడింది. బలహీనపడిన డాలర్ విదేశీ కొనుగోలుదారులకు బంగారం ధరలను తగ్గిస్తుంది. ఎందుకంటే, క్రయవిక్రయాలు డాలర్లలో జరుగుతాయి కాబట్టి. అందువల్ల, ప్రపంచవ్యాప్తంగా బంగారం కొనుగోళ్లు పెరిగాయి.

## కేసీఆర్ కు సిట్ నోటీసులు

కేసు దర్యాప్తు అధికారి, ఏసీపీ వెంకటగిరి ముందు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు విచారణకు రావొచ్చని.. లేదా ఆయన వయసు రీత్యా ఆయనకు తగిన చోట విచారణకు హాజరు కావొచ్చని నోటీసులో పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో నోటీసులు అందజేశారు. కేసీఆర్ ఎక్కడ విచారణ కోరుకుంటున్నారో దర్యాప్తు అధికారికి తెలపాలని నోటీసుల్లో సూచించారు. వయసురీత్యా పీఎస్ రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు విచారణకు సిద్ధంగా ఉండాలన్నారు. హైదరాబాద్ పరిధిలో KCR కోరిన చోటే విచారణ జరుగుతుందని... అయితే ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు సిట్ అధికారులు. జనవరి 30 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేసీఆర్‌ను విచారించనున్నారు సిట్ అధికారులు. ఫోన్ టాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు BRS అగ్రనాయకులను విచారించారు సిట్ అధికారులు. మాజీ మంత్రి హరీష్ రావు, పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కేటీఆర్. మాజీ ఎంపీ సంతోష్ రావును ప్రశ్నించారు. వీరి నుంచి సేకరించిన వివరాలు, ప్రస్తుతం జైల్లో ఉన్న పోలీసు అధికారుల నుంచి సేకరించిన వివరాలు ఆధారంగా KCRను ప్రశ్నించనున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో గత BRS ప్రభుత్వం హయాంలో జరిగిన అక్రమ ఫోన్ నిఘా ఆరోపణలతో మొదలైంది.. 2024 మార్చిలో ఈ విషయం వెలుగుచూసిందిఅప్పటి ఇంటిలిజెన్స్ బ్యూరో అధికారులు ముఖ్యంగా మాజీ SIB చీఫ్ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ప్రతిపక్షనేతలు, వ్యాపారవేత్తలు, పాత్రికేయులు, న్యాయమూర్తులు, సెలబ్రెటీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయ్ 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. SIB లోని అదనపు ఎస్పీ ప్రణీత్ రావు ఫిర్యాదు మేరకు DSP ప్రణీత్ రావు వంటి అధికారులపై అక్రమ నిఘా ఆరోపణలతో కేసు ప్రారంభమైంది. 600 మందికిపైగా ఫోన్లు ట్యాప్ చేశారని వేలమంది కాల్ డేటా రికార్డులు, ఇంటర్నెట్ ప్రోటోకాల్ డేటా రికార్డులు అక్రమంగా యాక్సెస్ చేశారనే ఆరోపణలున్నాయి. ఇది ముఖ్యంగా ప్రతిపక్షాలను నియంత్రించేందుకు, ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు జరిగిందనే ఆరోపణలున్నాయఈ కేసు దర్యాప్తు కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటైంది. 2025 డిసెంబర్ నుంచి 2026 జనవరి వరకూ సిట్ హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో మరింత బలపడింది. పలువురు SIB అధికారులు అరెస్ట్ అయ్యారు. BRS అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు విచారణకు హాజరయ్యారు..

తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేశారన్న హరీష్

ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతోంది.. BRS వర్గాలు దీన్ని రాజకీయ ప్రతీకారంగా చూస్తున్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిఘా జరిగిందని, దాన్ని బయటపెట్టాలని చెబుతోంది. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య అని ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాలు, సిట్ విచారణలో వెలుగుచీసిన వాస్తవాల ఆధారంగానే తాము ముందుకు వెళ్తున్నామని సిట్ అధికారులు స్పష్టం చేశారు. జనవరి 30న జరగనున్న విచారణలో కేసీఆర్ ఎలాంటి ప్రశ్నలు ఎదుర్కొంటారు? ఏ సమాధానాలు చెబుతారు? ఇదే ఇప్పుడు ఉత్కంఠగా మారిందితెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఈ కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ జాతి పిత అని, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమని, అలాంటి నాయకుడిపై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని వ్యాఖ్యానించారు. పాలనలో తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ పేరుతో నోటీసుల డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూడటం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు.తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని హరీశ్ రావు కొనియాడారు. కేసీఆర్ చరిత్రను సృష్టిస్తే, ఆ చరిత్రను మలినం చేసేందుకు రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కేసీఆర్ వెంటే ఉందని, ప్రభుత్వ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు.

కేసీఆర్ అంటే గౌరవం

తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు నంది నగర్ లోని ఆయన నివాసంలో సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ వయసును దృష్టిలో ఉంచుకొని ఆయన కోరిన ప్రదేశంలోనే విచారిస్తామని సిట్ అధికారులు తమ నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు, కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వ్యవహారంలో పారదర్శకంగా సిట్ విచారణ జరుగుతోందని ఆయన అన్నారు. కేసీఆర్ పై తమకు ఎంతో గౌరవం ఉందని... అయితే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందో నిగ్గుతేలాల్సి ఉందని చెప్పారు. అప్పటి సీఎం, మంత్రుల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ స్థాయి ఉల్లంఘనలు జరిగే అవకాశమే లేదని ఆయన అన్నారు. పూర్తి స్థాయిలో సిట్ దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఎవరికైనా నోటీసులు ఇచ్చే అధికారం సిట్ కు ఉందని... కేసీఆర్‌కు నోటీసుల విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు. బాధ్యులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

## యూజీసీ నిబంధనలలో స్పష్టత లేదు

అమలులో ఉంటాయని తెలిపింది. ఈ కేసులో తదుపరి విచారణ మార్చి 19న జరుగుతుంది.UGC కొత్త నియమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గురువారం (జనవరి 29), భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విద్యార్థుల మధ్య వివక్షతను ఆరోపిస్తూ UGC కొత్త ఈక్విటీ నియమాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇరు వాదనలు విన్న తర్వాత, UGC ప్రమోషన్ ఆఫ్ ఈక్విటీ రెగ్యులేషన్స్ 2026పై సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీం కోర్టులో చర్చ సందర్భంగా ఏమి జరిగిందో పరిశీలిద్దాం..కొత్త UGC నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారణ జరిగింది. పిటిషనర్ల తరపు న్యాయవాది, కొత్త నియమం సమాజంలో వివక్షను సృష్టిస్తుందని వాదించారు. "రాజ్యాంగం అందరికీ రక్షణ కల్పిస్తుంది. పౌరులందరికీ రక్షణ కల్పించాలి. అయితే, కొత్త నిబంధనలు గందరగోళంగా ఉన్నాయి. సమాజంలో వివక్షను సృష్టిస్తున్నాయి. అవి OBC, SC, ST వర్గాలకు మాత్రమే అనుకూలమని సూచిస్తున్నాయి" అని పేర్కొన్నారు. వివక్షను నిబంధన 3(e) ఇప్పటికే నిర్వచిస్తుందని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. అలా నిర్వచిస్తున్నప్పుడు 3(c) అవసరం ఏమిటి? ఇది సమాజంలో విభజనలను సృష్టిస్తుంది. "ఇతర సామాజికవర్గాలపై వివక్షకు ఉదాహరణలు ఉన్నాయి, కానీ నేను అలా చేయడం లేదు" అని న్యాయవాది అన్నారు. దీనికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. "అంత అవసరం లేదు. కొత్త నియమాలు ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)కి అనుగుణంగా ఉన్నాయా లేదా అని మాత్రమే మేము పరిశీలిస్తున్నాము" అని అన్నారు. ప్రాథమికంగా ఈ నియంత్రణ భాష అస్పష్టంగా ఉందని, నిపుణులు దానిని పరిశీలించి, దుర్వినియోగం కాకుండా దానిని సవరించాలని CJI అన్నారు. సెక్షన్ 3(సి) పై స్టే కోరుతున్నట్లు న్యాయవాది చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌తో అన్నారు. ఇది కొన్ని వర్గాలపై మాత్రమే వివక్షను కలిగిస్తుందన్నారు. దీంతో CJI సూర్యకాంత్, "ఒక దక్షిణ భారత విద్యార్థి ఉత్తర భారతదేశంలోని కళాశాలకు వచ్చి అనుచిత వ్యాఖ్యలు పడాల్సి వచ్చిందనుకుందాం. సెక్షన్ 3(ఇ) దానిని ప్రస్తావిస్తుందా?" అని సీజేఐ ప్రశ్నించారు. దానికి న్యాయవాది బదులిచ్చారు, "అవును. మేము చెప్పేది అదే, కొన్ని కులాల కోసం ప్రత్యేక విభాగాన్ని సృష్టించాల్సిన అవసరం లేదు." అన్నారు. కొత్త UGC నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2012 నాటి నిబంధనలు అమలులో ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మార్చి 19, 2026 నాటికి స్పందనలు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, UGCకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ మార్చి 19న జరుగుతుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ పేర్కొన్నారు. "మనం కుల రహిత సమాజం వైపు పయనిస్తున్నామా లేదా వెనుకకు వెళ్తున్నామా? విద్యార్థులు హాస్టళ్లలో కలిసి జీవించడం మనం చూశాం. కొత్త నియమాలు ప్రత్యేక హాస్టళ్లను సృష్టిస్తాయి. ఇది జరగకూడదు" అని సీజేఐ సూర్యకాంత్ నిబంధనలపై స్టే విధిస్తూ ప్రశ్నించారు. ప్రస్తుత సమాజంలో.. దేశంలో ఐక్యత కోసం మనం కృషి చేయాలని జస్టిస్ బాగ్చి కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "మేము ప్రభుత్వం నుండి ప్రతిస్పందనను కోరుతాము. కొంతమంది ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకోవచ్చు. నిపుణుల కమిటీ కూడా ఏర్పాటు కావచ్చు" అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు.

# పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణము, అగ్నిప్రతిష్ట,భేరీపూజ, దేవతాహ్వానం



జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 29:

యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన గురువారం ఉదయం ఆలయంలో ధ్వజారోహణం,అగ్నిప్రతిష్ట, మూలమంత్ర జపములు, వేదపారాయణములను ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు యజ్ఞాచార్యులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం భేరీపూజ, దేవతాహ్వానమును అర్చకులు వేదోక్తంగా నిర్వహించగా భక్తులకు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తరించారు.

**ధ్వజారోహణం..**


ధ్వజారోహణం సందర్భంగా తెల్ల వస్త్రంపై భగవానుడి వాహనమైన గరుడ ఆళ్వారును చిత్రించి పూజాదికాలు నిర్వహించి ధ్వజస్తంభంపై అలంకరించి 33 కోట్ల మంది దేవతలను ఆహ్వానించారు. సామూహిక దీక్షాపరులైన వేదపారాయణికులచే చతుర్వేద పారాయణాలు, పురాణ ఇతిహాస,ప్రబంధ మూలమంత్ర, మూర్తిమంత్ర జపములను నిర్వహించారు.

**భేరీపూజ, దేవతాహ్వానం..**

బ్రహ్మోత్సవాలకు విచ్చేయమని బ్రహ్మాది దేవతలను ఆహ్వానించుటకై ఆయారాగ,తాళ వాయిద్యములతో భేరీ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భగవానుడు,శబ్దస్వరూపుడు కనుక శబ్ద నాదములతో భగవానుడిని ఆరాధించుట ఈ వేడుకలలో ప్రత్యేకత అని వివరించారు. ఉత్సవాల్లో ఆలయ ఈవో భవానీశంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మామూర్తి అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బ్రహ్మోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేటి నుంచి వాహన సేవలు ప్రారంభంకానున్నాయి. ఉదయం సింహవాహనంపై, రాత్రి అశ్వవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం స్వామి వారి ఎదుర్కోళ్ల మహోత్సవం జరగనుంది.

# అమ్మో.. పులి...

- గ్రామాలను భయపెడుతున్న పులి
- యాదగిరిగుట్ట, తుర్కపల్లి, రాజాపేట మండలాల్లో సంచారం
- ఇప్పటికే లేగదూడలపై దాడి చేసినట్టు గుర్తింపు
- పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న అటవీ అధికారులు



జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 29:

యాదగిరిగుట్ట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల హీట్ కొనసాగుతుంటే మండల పరిధిలోని గ్రామాల్లో మాత్రం ప్రజలను పెద్దపులి భయం వెంటాడుతోంది. ఎక్కడి నుండి వచ్చి తమపై దాడి చేస్తుందేమోనన్న భయంతో గ్రామాల్లోని ప్రజలు, రైతులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. యాదగిరిగుట్ట మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇప్పటికే పెద్ద పులి అడుగులను గుర్తించిన అధికారులు గ్రామస్తులను అప్రమత్తం చేశారు. యాదగిరిగుట్ట మండల పరిధిలోని దాతారుపల్లి, రాళ్లజనగాంలో లేగదూడలపై పెద్ద పులి దాడి చేసి చంపిందని,బస్వాపురం ప్రాజెక్టు సమీపంలో పెద్దపులిని చూసినట్టు సోషల్‌మీడియాలో వార్తలు చెక్కర్లు కొడుతుండడంతో ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని గ్రామాలతో పాటు పట్టణ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించినట్టు వార్తలు వస్తున్నాయి. ఒక్క యాదగిరిగుట్ట మండలమే కాకుండా తుర్కపల్లి,రాజాపేట మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద పులి అడుగులను అధికారులు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు ఇప్పటికే రంగంలోకి దిగిన అటవీ అధికారులు పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పెద్దపులి సంచరించిన మార్గాన్ని మార్క్ చేసి ఎక్కడి నుంచి వచ్చింది ఎటువైపు వెళ్లిందోననే అంచనాకు వచ్చిన అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పెద్ద పులి దాడి చేస్తుందన్న భయంతో దాదాపు గత 10 రోజులుగా రాత్రి సమయాల్లో పల్లెలు పూర్తిగా నిర్మానుష్యంగా మారిపోయాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. త్వరగా పెద్దపులిని పట్టుకోవాలని, ఇళ్లలో నుండి భయటకు వెళ్లే పరిస్థితి లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పెద్ద పులిని పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అటవీ అధికారులు తెలిపారు. ఇప్పటికే సీసీ, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, త్వరలో పెద్దపులిని పట్టుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పులి అడుగుల ఆధారంగా ఎటు వెళ్తుందో తెలుసుకొని ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్టు తెలిపారు.


# ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- యాదగిరిగుట్ట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఛైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్, వైస్ ఛైర్మన్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్ ప్రకటన
- మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధికే ఓటేయండి
- సీపీఐతో పొత్తుతోనే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య



జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 29:

మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధికే ఓటు వేయాలని, ప్రజాపాలనలో సంక్షేమాభివృద్ధి నిర్విరామంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని తన నివాసంలో సీపీఐ,కాంగ్రెస్ నేతలతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ,గ్రామపంచాయతీ ఎన్నికల మాదిరిగా సీపీఐతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. పొత్తులో భాగంగా యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో కాంగ్రెస్ 11, సీపీఐ 1 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు, మరికొన్ని చోట్ల సీపీఎంతో కూడా పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో పట్టణాల అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని, యాదగిరిగుట్ట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో యాదగిరిగుట్ట,ఆలేరుతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలోని 6 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని, మున్సిపల్ 12వ వార్డు సీట్లను అంగీకరించామని, ఒక కోఆప్షన్ కూడా ఇస్తామని చెప్పారని తెలిపారు. భవిష్యత్‌తో యాదగిరిగుట్ట పట్టణాభివృద్ధికి రెండు పార్టీలు కలిసి కృషి చేస్తాయని తెలిపారు.యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో 12వ వార్డు కౌన్సిలర్ సీట్లు పాటు ఒకటి కోఆప్షన్ మెంబర్ సిపిఐ పార్టీకి కేటాయించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 11 మున్సిపల్ కౌన్సిలర్ సీట్లలో పోటీ చేస్తుందని తెలిపారు. ఆలేరులో కూడా కో ఆప్షన్ అవసరమైతే రేపు జరిగే ఎలక్షన్స్ లో ఎక్కువ సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఆలేరులో సిపిఎంకి కూడా ఒక కోఆప్షన్ ఇస్తామని బీర్ల అయిలయ్య తెలిపారు.



**యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రకటన**

యాదగిరిగుట్ట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ అభ్యర్థి ముక్కెర్ల మల్లేష్ యాదవ్ ను యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి అధ్యక్షులు బీర్ల అయిలయ్య ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సిపిఐ పార్టీ నేతలు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, బందారపు భిక్షపతి, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, పెంటయ్య, బంగారి, బబ్బూరి శ్రీధర్, గుండు వెంకటేష్ గౌడ్, కాటబత్తిని ఆంజనేయులు, ఎరుకల హేమేందర్, బరిగే రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



# దేవరకద్ర మున్సిపాలిటీలో బిజెపి నామినేషన్ ర్యాలీ

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు దేవరకద్ర మున్సిపాలిటీలో బిజెపి నామినేషన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కెవియన్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ డోకుర్ పవన్ కుమార్ రెడ్డి,దేవరకద్ర అసెంబ్లీ ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామీ దేవస్థానం మద్ద కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. కావున దేవరకద్ర నియోజక వర్గ కేంద్రానికి చెందిన మూసాపేట్, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు, పధాధికారులు, నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొనాలని బిజెపి నాయకులు కోరారు.

# నేడు దేవరకద్రకు ఎమ్మెల్యే జిఎంఆర్ రాక



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రానికి శుక్రవారం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ వస్తున్నట్లు ఆ పార్టీ అంజన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు దేవరకద్ర శాసనసభ్యులుజి. మధుసూదన్ రెడ్డి {జిఎంఆర్} ఆదేశాల మేరకు దేవరకద్ర మున్సిపాలిటీలో నామినేషన్ల పర్వం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి {జిఎంఆర్} ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. కావున దేవరకద్ర మండలంలోని, అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, మరియు నూతన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవదళ్ పాల్గొని, ఇట్టి కార్యక్రమాన్ని, జయప్రదం చేయాలని అంజల్ రెడ్డి కోరారు.



# యాదగిరిగుట్ట ఈవోగా భవానీ శంకర్ బాధ్యతలు చేపట్టారు

జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 29:

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈవోగా ఐఏఎస్ అధికారి జే.భవానీ శంకర్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేసి స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందించారు. దర్శనం అనంతరం యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆలయంలోని పరిస్థితులను అడిగి తెలుసుకొని పాతగుట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.

# రెండో రోజు 21 నామినేషన్లు



జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 29 :

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజైన గురువారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 12 వార్డులకుగానూ 21 నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అసిస్టెంట్ అధికారి లింగ స్వామి తెలిపారు. రెండో రోజుల్లో మొత్తం 36 నామినేషన్లు దాఖలయ్యాయయని తెలిపారు. కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 12, బీజేపీ 7, సీపీఐ ఒకటి, ఇండిపెండెంట్లు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

# రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన




జయభేరి, దేవరకద్ర :

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం దేవరకద్రలోని డోకూర్ సమీపంలో గల తపోవన్ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రఘుబాబు రోడ్డు భద్రత నియమాలపై ఉన్నత పాఠశాల పిల్లలకు రోడ్డు భద్రత మరియు నియమాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే విద్యార్థులందరూ ట్రాఫిక్ రూల్స్ ని పాటించాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు చంద్రయ్య, నర్సింహులు , రవి, శ్రీనివాసులు, ఇక్బాల్ పాష, తిరుపతయ్య, కురుమూర్తి, నాగరాజు, అనురాధ, ఉమ, సబీహా, పావని, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, భార్గవి పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- నామినేషన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలి
- నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ డి.జానకి




జయభేరి, దేవరకద్ర :

దేవరకద్ర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం రెండవ రోజు జిల్లా ఎస్పీ డి. జానకి దేవరకద్ర మున్సిఫల్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా శాంతియుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యం అని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉన్నదని, అలాగే నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి గుంపులు కూడరాదని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల్లో ప్రవేశించే వ్యక్తుల సంఖ్య ఎన్నికల నిబంధనల ప్రకారం మాత్రమే ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రజలు మరియు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిఫల్ కమిషనర్ నరేష్‌బాబు, భూత్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, దేవరకద్ర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నాగన్నతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

- సమ్మె బుక్స్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు
- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి పిలుపు

జయభేరి, పరవాడ:

ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెలో కార్మికుల, ఉద్యోగులు, రైతులు భాగస్వాములు కావాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పరవాడ ఫార్మసిటీలో గురువారం సమ్మె పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్డీఏ హయంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్చవద్దని కేంద్ర కార్మిక సంఘాలు ఎంత హితవు పలికిన పెడదోవన పెట్టారన్నారు. బీహార్ ఎన్నికల తర్వాత మరింత వేగం పెంచిందని ఆవేదన వ్యక్తం చేశారు.




కార్మిక వర్గంలో ఎంత వ్యతిరేకత వచ్చినప్పటికీ, తమ విధానాలు అమలు చేయడం బిజెపి లక్ష్యంగా పెట్టుకుందని అర్థమవుతుందన్నారు. బిజెపి విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులకు పెద్ద ఎత్తున కదిలి రావాలని గని శెట్టి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నాలన్నారు. సంఘటిత, అసంఘీత కార్మికులు వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడం ద్వారా బిజెపి ప్రభుత్వ తలొగ్గాలా ఉండాలన్నారు. లేదంటే బిజెపికి షాక్ తగలదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఈ రాష్ట్రంలో సమ్మెను విఫలం చేసి ప్రయత్నం చేస్తుందని చెప్పారు. అందుకోసం తన అన్ని శాఖల్ని మనపై ఎక్కువ పెట్టిందని చెప్పారు. ఈ దుర్గటనను కూడా కార్మికులు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలనే పిలుపునిచ్చారు. పోరాడి సాధించిన 8 గంటలను 10 గంటలు చేయడాన్ని గని శెట్టి తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 12 సమ్మెకు రాష్ట్రంలో ప్రధాన సంఘటిత రంగాలైన రవాణ రంగాలైన రైల్వే, బస్సు, ఆటో లను నిలుపుదల చేయలన్నారు.

బ్యాంకు, ఇన్సూరెన్స్, అన్ని రంగాల కార్మికులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగం ఢిల్లీ వీధుల్లో కేంద్ర రాజధానిలో ఏడాది పాటు ఏవిధంగా పోరాటం చేశారో, ఆవిధంగా చేస్తేతప్పా బిజెపి కేంద్ర ప్రభుత్వం దిగిరాదన్నారు.

లేదంటే ఈ ప్రభుత్వాన్ని మేడలు వంచటం అసాధ్యం అవుతుందని కార్మికులకు గుర్తించాలన్నారు. 12వ తేదీ సమ్మెకు కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి హామీ కూలీల సమ్మెలో పాల్గొనాలని కోరారు. లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాడుతామని అన్నారు. ఈ సమావేశంలో కే అప్పలరాజు, సత్తిబాబు, నాయుడు, చిట్టిబాబు, రమణ పాల్గొన్నారు.



## కెసిఆర్ కు నోటీసులు ఇవ్వడం దురదృష్టకరం

జయభేరి, తుర్కపల్లి, జనవరి 29 :

ఫోన్ టాపింగ్, సీట్ విచారణకు రావాలని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు నోటీసులు ఇవ్వడం దురదృష్టకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. హామీలను నెరవేర్చమని అడిగితే విచారణలు, కేసులను పెట్టి బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అలాంటి రాజకీయాలను మానుకోవాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, సర్పంచులు బద్దు నాయక్, చౌదర్పల్లి సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీలు గిద్దె కరుణాకర్, ఏషాబోయిన రాజయ్య యాదవ్, ప్రతిభ రాజేష్ నాయక్, మాజీ సర్పంచులు కల్లూరి ప్రభాకర్ రెడ్డి, మాలోతు శ్రీను నాయక్, మేకల అమలా బాలకృష్ణ, నాయకులు సురేందర్, యాదగిరి, సంతోష్ నాయక్, భాను, భూపతి అజయ్, అనిల్, గణేష్, తిరుపతి పాల్గొన్నారు.

## టిఆర్పి పార్టీ అన్ని మునిసిపాలిటీల్లో పోటీ చేస్తుంది



జయభేరి, తుర్కపల్లి, జనవరి 29 :

టిఆర్పి పార్టీ అన్ని మునిసిపాలిటీలో పోటీ చేస్తుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా మునిసిపల్ ఎన్నికల ఇన్చార్జ్ కొమిరిశెట్టి నర్సింహులు అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో టీఆర్పి పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులు పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు అభ్యర్థులను నిర్ణయించబడును. సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం, రైట్ టు రికాల్ ఓటును వాపసు తీసుకునే హక్కు, మన డబ్బు మన నిర్ణయం, మన వార్డులో వసులైన పన్నులు 40 శాతం వార్డులోనే ఖర్చు చేసే పథకం, బస్తీలకు భరోసా ల్యాండ్ టైటిల్ స్కీం, భద్రతతో కూడిన భరోసా, ట్రాఫిక్ చలాన్ల మాఫీ, పట్టణం మనది పాలన మనది, ప్రజా ఆడిట్ డే, యువత చేతికి రాజకీయాలు, ఈ మున్సిపాలిటీ మనది, టాక్సీ సేవల ఒప్పందం అనే మేనిఫెస్టోను విడుదల చేసినట్లు, ఎవరైనా పార్టీ నియమ నిబంధనను కట్టుబడి, ఉండి పోటీ చేసే అభ్యర్థులు సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా టి ఆర్పీ పార్టీ గుర్తు కత్తెర గుర్తు పై తమ అమూల్యమైన ఓటు వేసి టి ఆర్పీ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించగలరని కోరనైనది. ఈ కార్యక్రమంలో మోత్కూపల్లి రఘు, కృష్ణమూర్తి, పాంగాల కిష్టయ్య, బాలకృష్ణ, ఇటుకపల్లి బాల శంకర్, సిద్దెంకి మురళి, కృష్ణ పాల్గొన్నారు.

## జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ లో గురువారం జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను బేస్ అకాడమీ నిర్వాహకుడు డా" లక్ష్మణ్ ప్రొఫెసర్ చేతుల మీదుగా బేస్ ఇన్స్టిట్యూషన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన ఉద్యోగుల సంఘం స్టేట్ సెక్రటరీ ఎం.శంకర్, జిల్లా అధ్యక్షుడు గంగురం నాయక్, జనరల్ సెక్రటరీ సుభాష్ నాయక్, గౌరవ అధ్యక్షుడు అంతిరామ్ నాయక్, దివిజా నాయకులు ,హనుమంతు నాయక్, మాజీ జెడ్పిటిసి శేఖర్ నాయక్, గంగ నాయక్, పాండు నాయక్, ఉపాధ్యక్షుడు,కే.శంకర్ నాయక్, ప్రచార కార్యదర్శి తదితర గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## చందంపేటలో సీఎం కప్ క్రీడలు



జయభేరి, చందంపేట :

జెడ్పి హెచ్ఎస్ చందంపేటలో సీఎం కప్ క్రీడలను సీఎం కప్పు క్రీడల చైర్మన్ ఎంపీడీవో ఎల్ లక్ష్మి, కన్వీనర్ ఎంఈఓ పి నరసింహ ఎమ్మార్వో డి శ్రీధర్ బాబు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి లీలారాణి, సీఎం కప్ క్రీడల కోఆర్డినేటర్ PD డాక్టర్ తగుళ్ల వెంకట్ క్రీడలను ప్రారంభించిన సందర్భముగా వక్తలు మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని గెలుపు ఓటములను సమానంగా చూసే తత్వము అలబడుతుందని నాయకత్వ లక్షణాలు స్నేహభావము పోటీ తత్వము పెంపొందుతాయని తెలియజేసినారు. ఈ క్రీడలలో గెలుపొందిన వారు నియోజకవర్గస్థాయి సీఎం కప్ క్రీడలకు ఎన్నిక అవుతారని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గోవిందు కొండయ్య, ఎం చంద్రశేఖర్, జోసెఫ్ చౌదరి రామచంద్రు, విజయ ,మధు, చందంపేట మండల వివిధ గ్రామాల నుండి విచ్చేసిన క్రీడాకారులు గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు దేవరకద్రలో వాసవి మాత పల్లకి సేవ

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకి సేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో భక్తుశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాఘ మాసం 2 వ శుక్రవారం 2 వ టీం లగి శెట్టి కళ్యాణి టీం ఆధ్వర్యంలో ఉదయం 8:30 గంటలకు వారి టీం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 7:00 గంటలకు అమ్మవారి శ్రీ చక్రాలకు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తారు. 7:30గంటలకు లలితా సహస్రనామ పారాయణ, రాత్రి 8:30 గంటలకు అమ్మవారి పల్లకి సేవ, 9 గంటలకు తదుపరి అమ్మవారికి మహా మంగళ హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం కూడా నిర్వహిస్తారు. లగ్గి శెట్టి కళ్యాణి టీం ఆధ్వర్యంలో అల్పాహారం టిఫిన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. కావున ఆర్యవైశ్యులందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్వ కన్నయ్య శెట్టి,జిల్లా మహిళా సంఘం అధ్యక్షుల గుద్దేటి మంజుల రాణి, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లు కోరారు.

## మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం



జయభేరి, యాదగిరిగుట్ట :

యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత మహేందర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆలేరు, యాదగిరిగుట్ట ఇంఛార్జి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ, ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయి వరకు బలమైన వ్యూహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ గొంగడి మహేందర్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మండలంలో పులి సంచారం, భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

జయభేరి, తుర్కపల్లి, జనవరి 29 :

తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామ ఫారెస్ట్ లో కనిపించిన పులి గురువారం ఉదయం తిరుమలాపురం గ్రామం మీదుగా కొండాపూర్ వరకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం ఫారెస్ట్ అధికారులు పరిశీలించి పెద్దపులి అడుగులను నిర్ధారించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ నాయక్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా దత్తాయిపల్లి గ్రామ శివారులోని ఫారెస్ట్ లో పులి పట్టుకోవడానికి టైగర్ మానిటరింగ్ టీంతో అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం పులి, తిరుమలపురం గ్రామ శివారు ప్రాంతం నుండి కొండాపూర్ గ్రామం శివారు ప్రాంతం వరకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం సంఘటన స్థలానికి వెళ్లి పెద్దపులి అడుగులను గుర్తించి నిర్ధారించినట్లు తెలిపారు. తిరిగి దత్తాయిపల్లికి వస్తుందో లేదో, లేకుంటే సిద్దిపేట జిల్లా జగదేపూర్ మండలం పీర్లపల్లి గ్రామ శివారులోని అతిపెద్ద ఫారెస్ట్ లోకి వెళ్తుందో అనే అనుమానంగా ఉందని తెలిపారు.



ఆవులు మృతి చెందిన స్థలంలో ఆవుల కెమెరాలు ఉండడంతో పులి అక్కడికి వచ్చే అవకాశం ఉందని, వేచి చూస్తున్నట్లు తెలిపారు. తుర్కపల్లి మండలంలోని తిరుమలపురం, కొండాపురం, వీరారెడ్డిపల్లి, శ్రీనివాసపురం, వాసాలమర్రి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి 7 దాటిన తరువాత బయటకు రావద్దని, వ్యవసాయ బావుల వద్ద ఉన్న పశువులను, మేకలను ఇంటి వద్దకు తీసుకొని వచ్చి కట్టేసుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రాత్రి సమయంలో ఒంటరిగా అడవిలోకి, ఊరి బయటకు రావద్దని, గుంపులుగా రావాలని, టైగర్ మానిటరింగ్ టీం అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని, అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శాలిని, బీట్ ఆఫీసర్లు మల్లేశం, శ్రీనివాస్, టైగర్ మానిటరింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

జయభేరి, తుర్కపల్లి, జనవరి 29 :

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం తుర్కపల్లి మండల పెద్ద తండా, ధర్మారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం చిన్న లక్ష్మాపురం గ్రామంలో 5 లక్షల వ్యయంతో అంగన్వాడి కేంద్ర నూతన భవనానికి, 25.50 లక్షలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు, 5 లక్షల వ్యయంతో ఎస్టీ కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం రాష్ట్రంలోనే ఆలేరు అగ్రస్థానంలో ఉందని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు అంగన్వాడీ కేంద్రాలు లేవని అందుకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను సిసి రోడ్లను అండర్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రత్యేక చొరవ చూపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, సర్పంచులు కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, ధనావత్ రజిని, ధనావత్ విజయ, రాజారాం నాయక్, జేరుపోతుల కరుణాకర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాంగ్రెస్ ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు తుమ్మల మమత తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కానుగంటి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పలుగుల శ్రీనివాసు, ఓబిసి జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, మండల ఉపాధ్యక్షుడు పనిగట్ల సుదర్శన్ గౌడ్, నాయకులు గడ్డమీది నిఖిల్ గౌడ్, ఎరుకల వెంకటేష్ గౌడ్, రామగోని శ్రీరామ్మూర్తి గౌడ్, బాలు యాదవ్, ఉపసర్పంచ్ పార్వతీ చిన్న నాయక్, వార్డు సభ్యులు సునీత నవీన్ రెడ్డి, నరేష్ నాయక్, సరిత రమేష్, ఓర్సు రాములు, నాయకులు మోత్కుపల్లి రవి, నరేష్ నాయక్, జయేందర్, రాజశేఖర్ రెడ్డి, నరికే సత్యారావు, పులిగిల్ల విష్ణు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## బి.బి. చారి సంతాప కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు



జయభేరి, భూపాలపల్లి :

భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బేతోజు భరత్ కుమార్ చారి (బి.బి. చారి) ఇటీవల పరమపదించగా, సుభాష్ కాలనీలోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన సంతాప సభ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ గండ్ర జ్యోతి, భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బి.బి. చారి గారు క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన నాయకుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పార్టీ బలోపేతానికి సలహాలు, సూచనలు అందిస్తూ గ్రౌండ్ లెవెల్‌లో అహర్నిశలు శ్రమించిన నాయకుడు చారి గారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం పార్టీకి తీరని లోటు అని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతరం చారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ప్రజాసేవ చిరకాలం గుర్తుండిపోయేలా సాగర్ రింగ్ రోడ్డు

- బైరమల్ గూడా ఫ్లైఓవర్ నిర్మించిన ఫ్లై ఓవర్కు స్వర్గీయ వంగ మధుసూదన్ రెడ్డి పేరును నామకరణం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్, మేయర్ కి వినతిపత్రం అందజేసిన GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**జయభేరి, ఎల్బీనగర్ :**



లోవర్ ట్యాంక్ బండ్, GHMC ప్రధాన కార్యాలయం లో హైదరాబాద్ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ IASకి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో స్టాండింగ్ కమిటీ సభ్యులు, హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ అధ్యక్షతన కలసి చంపాపేట్ కార్పొరేటర్ స్వర్గీయ వంగ మధుసూదన్ రెడ్డి ప్రజా సంక్షేమంలో మరియు ఎల్.బి నగర్ ప్రాంత అభివృద్ధిలో ఎనలేని కృషి చేసిన గొప్ప వ్యక్తి,వారి సేవలు ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తి



దాయకంగా నిలవాలని, అటువంటి మహనీయుని సేవలను గుర్తించి, ప్రజల మనసుల్లో ఆయన చేసిన ప్రజాసేవ చిరకాలం గుర్తుండిపోయేలా సాగర్ రింగ్ రోడ్డు, బైరమల్ గూడలో నిర్మించిన ఫ్లై ఓవర్కు "వంగ మధుసూదన్ రెడ్డి ఫ్లై ఓవర్" అని పేరు నామకరణం చేయాలని జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలపాలని వినతిపత్రం అందజేయడం తో, స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగింది. పార్టీలకతీతంగా,రాజకీయాలకు అతీతంగా ఒక మంచి నాయకుడి సేవలను గుర్తించి ఆయనకు తగిన గౌరవం అందించిన ఈ సంఘటన ప్రజాస్వామ్యానికి, రాజకీయ పరిపక్వతకు నిలువెత్తు నిదర్శనం కీ.శే. వంగా మధుసూదన్ రెడ్డి పేరు ఎల్బీ నగర్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని తెలియజేస్తూ, ఈ మహత్తర నిర్ణయానికి సహకరించిన జిహెచ్ఎంసి కమిషనర్,మేయర్ గారికి, స్టాండింగ్ కమిటీ సభ్యులకు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తాజా, మాజీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లకు మాజీ కౌన్సిలర్లకు అందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు. అదేవిధంగా "మాజీ ప్రధానమంత్రి, అటల్ బిహారీ వాజ్పేయి " విగ్రహం కూడా బర్కత్పుర చమన్ లో ఏర్పాటు చేసేందుకు కూడా ఆమోదం తెలిపిన GHMC స్టాండింగ్ కమిటీ. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, జి హెచ్ఎంసి కార్పొరేటర్లు C.N రెడ్డి, బొంతు శ్రీ దేవి యాదవ్, లచ్చి రెడ్డి, జగదీశ్ గౌడ్, పవన్ కుమార్, పుష్ప నాగేష్, స్వర్ణరాజ్, ప్రభు దస్, మహా లక్ష్మీ, ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# డాక్టర్ సముద్రాల దంపతులకు సన్మానం

**జయభేరి, గుడిపల్లి :**



డాక్టర్ రాములు గుడిపల్లి గ్రామంలో గుడిపల్లి స్కూల్లో విద్య అభ్యసించి అంచలంచలుగా ఎదుగుతూ 1976 ఇండియా నుండిఅమెరికా లో స్థిరపడి పుట్టిన ఊరిలో సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ఊరి అభివృద్ధికి తోడ్పడుతున్నం దున వారు ఇండియాకు విచ్చేసిన విషయం తెలుసుకొని హైదరాబాదులో వారిని కలిసి మర్యాదపూర్వకంగా గ్రామ సర్పంచ్ కోరగా వారు గ్రామానికి విచ్చేసి నందున వారికి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడు తూ.. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ రాములు ని బొడ్రాయి ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే వారు స్పందిస్తూ అంగీకారం చెప్పడం జరిగిన ది. గుడిపల్లి హైస్కూల్లో బాత్రూం లేక విద్యార్థిని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలపగా 5 లక్షల రూపాయలు వారి సొంతంగా ఏర్పాటు చేస్తా అని చెప్పడం జరిగింది. గుడిపల్లి హైస్కూల్లో తేరా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన 10 కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయని తెలుపగా కంప్యూటర్ కోచింగ్ ఇచ్చే వ్యక్తికి ప్రతి నెల జీతం చెల్లిస్తానని 20 వేల రూపాయలు కేటాయించినారు.

అదేవిధంగా ఆసుపత్రిని సందర్శించి ఆస్పత్రి కి విచ్చేసి ప్రజలు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వారి సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో శ్రీమతి అండాలు డిప్యూటీ తహసిల్దార్ విజయ లక్ష్మి ఎంఈఓ సముద్రాల శ్రీనయ్య డాక్టర్ ప్రియాంక వెటర్నరీ డాక్టర్ మల్లీశ్వరి ప్రాథమిక పాఠశాల Hm మల్లికార్జున్ అంగన్వాడి టీచర్ అలివేలు జయంతి సింగరాజుపల్లిసర్పంచ్ శ్రీను గుడిపల్లి ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య, గుడిపల్లిపంచాయతీ కార్యవర్గ సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికార దిశగా కృషి చేస్తా..

- వేముల శ్రీనివాస్ పై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసినట్లు ప్రకటించిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**జయభేరి, సైదాపూర్ :**




వేముల శ్రీనివాస్ పై ఉన్నటువంటి సస్పెన్షన్ ను మంత్రి ఎత్తివేస్తున్నట్లు ప్రకటిస్తూ మండలంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చెయ్యాలని, యువకులను పార్టీలో అధిక సంఖ్యలో చేర్చుతూ కాంగ్రెస్ పార్టీ కోసం మరింత పని చేసి రాబోయే రోజుల్లో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికార దిశగా కృషి చేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ దొంత సుధాకర్, వైస్ చైర్మన్ రాజ్ కుమార్, మాజీ జడ్పీటీసీ గుండారపు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపెల్లి కిష్టయ్య, మాజీ మార్కెట్ ప్యాక్స్ చైర్మన్ తిరుపతి రెడ్డి, యూత్ అధ్యక్షులు వేముల సాయి కుమార్, మాజీ యూత్ అధ్యక్షులు పిట్టల రాకేష్, మాజీ ఎంపీటీసీ కొండల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆడెపు రాజుహుస్నాబాద్ నియోజక వర్గ సోషల్ మీడియా ఇంచార్జి తాళ్ళపల్లి అజయ్, యూత్ ఉపాధ్యక్షులు రఘు, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు, కరీంనగర్ ఉప ససర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులు నవీన్ గౌడ్, సైదాపూర్ సర్పంచ్, దుద్దనపల్లి పల్లి సర్పంచ్, గ్రామ శాఖ వెంకటేశం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల శ్రీనివాస్ రాకతో హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీని మరింత గడప గడప కు చేర్చుట, సంక్షేమ పథకాలు అందేలా పార్టీ నిర్మాణం కోసం నిరంతరం కష్టపడుతానని తెలిపారు. నాకు మద్దుతుగా నిలిచిన మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# హుస్నాబాద్ మార్కెట్ యార్డు అభివృద్ధికి భారీగా నిధులు విడుదల

**జయభేరి, హుస్నాబాద్ :**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ యార్డులో అభివృద్ధి పనుల కోసం 805.50 లక్షల రూపాయలకు పరిపాలన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు. హుస్నాబాద్ ఏఎంసీ పరిధిలోని మార్కెట్ యార్డు హుస్నాబాద్ లో గోడౌన్ లు, కవర్డ్ షెడ్డులు, మార్కెట్ లోతట్టు ప్రాంతాల్లో ఉపరితల సీసీ పనుల కోసం 335.00 లక్షలు రూపాయలు.

హుస్నాబాద్ మార్కెట్ యార్డు లో బ్యాలెన్స్డ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం 25.00 లక్షల రూపాయలు. మార్కెట్ యార్డు లో విద్యుదీకరణకు 26.00 లక్షలు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కాంపౌండ్ వాల్ మరియు ఇంటర్నల్ బాక్స్ డ్రైన్ వెంబడి ఓపెన్ డ్రెయిన్ నిర్మాణానికి 400.00 లక్షల రూపాయలు. గోడౌన్ లకు షెడ్డులు పివిసి గట్టర్లు, డౌన్ స్పౌట్ లను కవర్ చేయడానికి ఎంఎస్ గట్టర్లను అందించడానికి 19.50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మార్కెట్ యార్డు అభివృద్ధికి కి భారీగా నిధులు కేటాయించడం పట్ల రైతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గం హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డు కు నిధులు 8.5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.



# 20వ వార్డు కేశవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

- ముఖ్య అతిథిగా బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**జయభేరి, మేడిపల్లి :**

మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కేశవరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొమ్మలపల్లి మల్లేష్ పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కార్యాలయాన్ని ప్రారంభించి అభ్యర్థికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందని, బొమ్మలపల్లి మల్లేష్ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. వారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**మూడు చింతలపల్లి మున్సిపల్ లో నామినేషన్ల పర్వం...**

మూడు చింతలపల్లి మున్సిపల్ ఎన్నికలలో భాగంగా 7వార్డు లింగాపూర్ తండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేతావత్ శ్రీకాంత్ నాయక్ నామినేషన్ కార్యక్రమంలో బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహ్మా రెడ్డి ఆద్వర్యంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, నాయకులతో కలిసి పాల్గొన్నారు.

# కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం అంటే.. తెలంగాణ ప్రజలకు ఇవ్వటమే..!

- ఖబర్దార్ కాంగ్రెస్.. రేవంత్ రెడ్డి.
- ఓయూ సీఎం రేవంత్ దిష్టి బొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్వీ

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్వీ కార్యకర్తలు గురువారం నాడు ఓయూ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని వ్యక్తి కేసీఆర్. అలాంటి వ్యక్తిని మీ రాజకీయ లబ్ధి కోసం, చిల్లర ప్రయోజనాల కోసం ఆయన వ్యక్తిత్వాన్ని ఆయన స్థాయిని పలుచన చేస్తాం అంటే మీ తరం కాదు.. ఆయన పేరు, ఆయన కీర్తి, ఆయన చేసిన అభివృద్ధి తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్రలా ఉంటదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి యాదవ్, పడాల సతీష్, చటారి దశరత్, జంగయ్య, నాగారం ప్రశాంత్, మిథున్ ప్రసాద్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్, అవినాష్,సాయి గౌడ్,బోయపల్లి నాగరాజు, మేడి పవన్, రాకేష్, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.




# 16 వ వార్డుకు నామినేషన్ వేసిన బిఆర్ఎస్ అభ్యర్థి కేతావత్ రూప్ల నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ సాధారణ ఎన్నిక ల సందర్భంగా గురువారం ఎనిమిదో వార్డులో కేతావత్ రూప్ల నాయక్ బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు అనంతరం మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుల అండదండలతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# సిపి సజ్జనార్ కు శుభాకాంక్షలు తెలియజేసిన ఓర్సు ముత్యాలు



**జయభేరి, డిండి :**

నూతనంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ )గా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్ ను గురువారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన బి ఆర్ ఎస్ వావిలికోల్ వడ్డెరగూడెం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసినారు.

# 19వ వార్డుకు నామినేషన్ వేసిన బిఆర్ఎస్ అభ్యర్థి ఖాదర్ బాబా



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ సాధారణ ఎన్నిక ల సందర్భంగా గురువారం 19 వార్డులో ఖాదర్ బాబా బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు అనంతరం మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుల అండదండలతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# సొంతగూటికి చేరుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్



**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ కేతావత్ మంజ్య నాయక్, వారి కుమారుడు కేతావత్ రూప్ల, భవానీ శ్రీధర్ తోపాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గులాబీ తీర్థం పుచ్చుకున్న వారికి కండువాలు కప్పి మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తమ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీలో వరుస చేరికలు కొనసాగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పై నమ్మకంతో, గతంలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలు ఫలితంగా రాష్ట్ర ప్రజలు గులాబీ పార్టీ వైపునకు ఆకర్షితులవుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని అన్నారు. బీఆర్ఎస్ తోనే దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించుకోవాలని సూచించారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందన్నారు. పురపీఠంపై గులాబీ జెండా ఎగురవేయలని ఆకాంక్షించారు. ప్రతీ కార్యకర్త క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేయాలని, బీఆర్ఎస్ పార్టీ గెలుపే ధ్యేయంగా సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నేతలు నేనావత్ కిషన్ రెడ్డి, కేతావత్ బిల్యా నాయక్, నీల రవికుమార్,బొడ్డుపల్లి కృష్ణ, పగిడిమర్రి నాగరాజు, జమీర్ బాబా, నేనవత్ నాగార్జున,సంతోష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా.. విద్యార్థిని మృతి

**జయభేరి, కాకినాడ :**

కాకినాడ రూరల్ కేంద్రీయ విద్యాలయ స్కూల్ పిల్లలను తీసుకువెళ్తున్న ఆటో రాయుడుపాలెం సెంటర్ వద్ద బోల్తా పడింది. ఘటనలో నాలుగో తరగతి చదువుతున్న ఐశ్వర్య అనే పాప తీవ్రంగా గాయపడి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగిలిన ఎనిమిది మంది విద్యార్థులను కాకినాడ జనరల్ హాస్పిటల్ కి తరలించారు. వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఒక లారీ ఢీ కొని ఆగకుండా వెళ్ళిపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.



## కొత్త జానర్, సెన్సేషనల్ విలన్‌తో స్కెచ్

### ఇండస్ట్రీ హిట్ తర్వాత అనిల్ రావిపూడి మాస్టర్ ప్లాన్

టాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్ ఏదైనా ఉందంటే అది దర్శకుడు అనిల్ రావిపూడి పేరు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కిన మన శంకర వరప్రసాద్ గారు సినిమా సంక్రాంతి కానుకగా విడుదలై, కేవలం పది రోజుల్లోనే రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఈ భారీ విజయం అనిల్ రావిపూడి మార్కెట్‌ను మరింత పెంచింది. ఈ విజయం తర్వాత అనిల్ రావిపూడితో సినిమా చేయాలనే ఆసక్తితో పలువురు అగ్ర హీరోల నిర్మాతలు క్యూ కడుతున్నారు. పవన్ కళ్యాణ్, రానా వంటి స్టార్లతో ఆయన నెక్స్ట్ ప్రాజెక్ట్ ఉంటుందంటూ సోషల్ మీడియాలో అనేక రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఇప్పటివరకు ఈ వార్తలపై దర్శకుడు గానీ, మేకర్స్ గానీ అధికారిక ప్రకటన చేయలేదు. ఇదిలా ఉండగా, తాజాగా అనిల్ రావిపూడి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ ఇండస్ట్రీలో కొత్త చర్చకు దారితీసింది. ఇప్పటివరకు తనకు బ్రాండ్‌గా మారిన ఫుల్ కామెడీ జానర్‌కు కొంత బ్రేక్ ఇచ్చి, పూర్తిగా భిన్నమైన జానర్‌లో సినిమా చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌పై తాను ఎంతో ఉత్సాహంగా ఉన్నానని కూడా చెప్పారు. అయితే, ఈ సినిమాలో హీరో ఎవరు అన్నది మాత్రం గోప్యంగా ఉంచారు. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర వార్త ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అదేంటంటే, అనిల్ రావిపూడి తన నెక్స్ట్ సినిమాలో విలన్ పాత్రకు మలయాళ స్టార్ ఫహద్ ఫాజిల్‌ను ఎంపిక చేయాలని భావిస్తున్నారట. ఇప్పటికే కథపై చర్చలు జరిగాయని, కథ విన్న వెంటనే ఫహద్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్న సమాచారం వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయనకు సంబంధించిన లుక్ టెస్ట్ కూడా జరుగుతున్నట్టు టాక్. సాధారణంగా ముందుగా హీరో ఫిక్స్ చేసి తర్వాత విలన్ ఎంపిక చేస్తారు. కానీ ఇక్కడ హీరో ఇంకా ఫైనల్ కాకుండానే విలన్ సెట్ కావడం ఇండస్ట్రీలో అరుదైన విషయమే. ఈ వార్తలు నిజమైతే, అనిల్ రావిపూడి ఈసారి పూర్తిగా కొత్త స్టైల్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నాడని చెప్పొచ్చు. కొత్త జానర్, పవర్‌ఫుల్ విలన్ కాంబినేషన్‌తో మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమనే అంచనాలు అప్పుడే మొదలయ్యాయి.

## దసరాకు రానున్న ఫౌజీ



ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ డ్రామా 'ఫౌజీ' చిత్రాన్ని దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. గురువారం ఈ విషయాన్ని మేకర్స్ వెల్లడించారు. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.

స్వాతంత్రోద్యమ కాలం నాటి ఈ కథలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. యుద్ధం, త్యాగం, దేశభక్తి, ప్రేమ ప్రధానాంశాలుగా హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నదని, సినిమా పూర్తయ్యేంత వరకు నాన్‌స్టాప్‌గా ఈ షెడ్యూల్ కొనసాగుతుందని దర్శకుడు పేర్కొన్నారు. ఇమాన్వీ, అనుపమ్‌ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సుదీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచనదర్శకత్వం: హను రాఘవపూడి.

## ఈ బ్యూటీ లక్ మామూలుగా లేదుగా..



బాలీవుడ్ యంగ్ సూపర్ స్టార్ కార్తీక్ ఆర్యన్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. వరుస హిట్లతో దూసుకుపోతున్న ఆయన సరసన నటించే హీరోయిన్లకు అక్కడ మంచి డిమాండ్ ఉంటోంది. ప్రస్తుతం కార్తీక్ హీరోగా రెండు పెద్ద సినిమాలు రూపొందుతున్నాయి. అందులో ఒకటి ప్రముఖ దర్శకుడు కబీర్ ఖాన్ తెరకెక్కిస్తున్న చిత్రం కాగా, మరొకటి 'నాగ్ జిల్లా' అనే మూవీ. ఈ రెండింటిలో ఒక సినిమాలో హీరోయిన్‌గా ప్రీతీ ముకుందన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్ర నిర్మాతలతో చర్చలు జరుగుతున్నాయని, మరో రెండు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో బాలీవుడ్ మేకర్స్ సౌత్ హీరోయిన్ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు అదే జాబితాలో ప్రీతీ ముకుందన్ కూడా చేరబోతున్నారు. బాలీవుడ్ లో ఒక చిన్న ఛాన్స్ కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్న తరుణంలో, ప్రీతీకి ఏకంగా కార్తీక్ ఆర్యన్ సినిమాలో అవకాశం రావడం నిజంగా విశేషమే. ఈ అవకాశం గనుక సద్వినియోగం చేసుకుంటే ఆమె కెరీర్ ఒక్కసారిగా మలుపు తిరిగే అవకాశం ఉంది. ప్రీతీ ముకుందన్ కేవలం అందగత్తె మాత్రమే కాదు, మంచి విద్యావంతురాలు కూడా. ప్రతిష్టాత్మకమైన నిట్ (NIT) లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. చదువుతో పాటు చిన్నప్పటి నుంచి భరతనాట్యంలో శిక్షణ పొందారు. ఒక ఇంజనీర్ గా, క్లాసికల్ డ్యాన్సర్ గా ఆమెకు ఉన్న క్రమశిక్షణే ఆమెను ఇక్కడి వరకు తీసుకువచ్చాయి.

## ఈ జిడ్డు మొఖంది హీరోయినా అన్నాడు..



ఐశ్వర్య రాజేష్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తక్కువ సమయంలోనే తమిళ సినిమా ప్రపంచంలో అగ్ర నటిగా మారింది. కంటెంట్ ప్రాధాన్యత, వైవిధ్యమైన సినిమాలు ఎంచుకుంటూ నటిగా ప్రశంసలు అందుకుంది. తెలుగులో చివరగా సంక్రాంతికి వస్తున్నాం మూవీతో భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు తమిళంలో వరుస సినిమాలతో అలరిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో గ్లామరస్ ఫోటోషూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా గతంలో ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరలవుతున్నాయి. కేవలం అందం, గ్లామర్‌తో వచ్చే అవకాశాలను కాకుండా, బలమైన కథలు, పాత్రలనే ఎంచుకుంటానని ఆమె చెప్పారు. "కౌసల్య కృష్ణమూర్తి" సినిమా తన కెరీర్‌లో ఒక మైలురాయి అని, దానికోసం బౌలింగ్ నేర్చుకోవడం లాంటి శారీరక శ్రమ చేశానని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. థియేటర్లలో పెద్దగా ఆడకపోయినా, టీవీలో ప్రసారమయ్యాక ఆ సినిమా పెద్ద హిట్ అయిందని, తనను "కౌసల్య అక్క"గా చిన్న పిల్లలు గుర్తించడం ఆశ్చర్యపరిచిందని తెలిపారు. "వరల్డ్ ఫేమస్ లవర్" చిత్రంలోని సువర్ణ పాత్ర గురించి మాట్లాడుతూ, తెలుగు హీరోయిన్లు తెల్లగా, సన్నగా, గ్లామరస్‌గా ఉండాలనే ఒక మైండ్‌సెట్ తనలోనూ ఉండేదని, అందుకే తాను తెలుగు సినిమాలకు సరిపోనని భావించానని చెప్పారు. అయితే, మేకప్ లేకుండా, ఐదేళ్ల బాబు తల్లిగా నటించిన సువర్ణ పాత్రకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, ఆడియన్స్ చాలా ఓపెన్‌గా ఉన్నారని, కంటెంట్‌ను ఆదరిస్తారని ఆమె వివరించారు. భవిష్యత్తులో గ్లామరస్, డాన్సింగ్ రోల్స్ చేయాలని ఆశిస్తున్నానని, పది రోజుల షూట్ కోసం 10% డిస్కౌంట్ కూడా ఇస్తానని సరదాగా చెప్పారు.

## వారికి ఢిల్లీ హైకోర్ట్ వార్నింగ్..

### ఇక నుండి ఎన్టీఆర్ పేరుని తప్పుగా వాడితే అంతే..!



టాలీవుడ్ స్టార్ హీరో, యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన పేరు, ఫోటోలు, గుర్తింపును అనుమతి లేకుండా వినియోగిస్తూ డిజిటల్ దుర్వినియోగం చేయడంపై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎన్టీఆర్‌కు చెందిన పర్సనాలిటీ రైట్స్, పబ్లిసిటీ రైట్‌స్‌కు పూర్తి చట్టపరమైన రక్షణ కల్పిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా డిజిటల్ యుగంలో సెలబ్రిటీల హక్కులపై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన పేరు, ఇమేజ్, ట్యాగ్‌లను సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్రకటనలు తదితర వేదికలపై అనధికారికంగా వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారంటూ ఎన్టీఆర్ ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని సవివరంగా పరిశీలించిన కోర్టు, ఎన్టీఆర్ దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందిన ప్రముఖ నటుడని స్పష్టం చేసింది. అంతేకాదు, ఆయన పేరు, గుర్తింపుకు స్పష్టమైన కమర్షియల్ విలువ ఉందని పేర్కొంది.

కోర్టు వ్యాఖ్యానిస్తూ, ప్రజలు ఎన్టీఆర్‌ను ఎన్టీఆర్, తారక్, జూనియర్ ఎన్టీఆర్, నందమూరి తారక రామారావు జూనియర్ అనే పేర్లతో పాటు యంగ్ టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ వంటి ట్యాగ్‌లతో కూడా గుర్తిస్తారని పేర్కొంది. ఈ పేర్లు, గుర్తింపులు అన్నీ ఆయన వ్యక్తిత్వంతో విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయని కోర్టు స్పష్టం చేసింది. అనుమతి లేకుండా ఎన్టీఆర్ పేరు, ఫోటోలు లేదా గుర్తింపును వాణిజ్య అవసరాల కోసం వినియోగించడం చట్ట విరుద్ధమని కోర్టు తేల్చిచెప్పింది. సోషల్ మీడియా లేదా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఇలాంటి కంటెంట్ ఉన్నట్లయితే, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించింది. అలాగే భవిష్యత్తులో కూడా ఈ తరహా దుర్వినియోగం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

ఈ కేసులో మరో కీలక అంశంపై కూడా కోర్టు దృష్టి సారించింది. గుర్తుతెలియని వ్యక్తులు లేదా సంస్థలు ఎన్టీఆర్ పేరు లేదా ఇమేజ్‌ను ఉపయోగించి మోసాలకు పాల్పడినా, ఈ ఉత్తర్వులు వారికి కూడా వర్తిస్తాయని పేర్కొంది. ఎవరు అయినా ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తే లేదా ప్రజలను తప్పుదోవ పట్టిస్తే, కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎన్టీఆర్ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చిన అంశాల్లో డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ ప్రకటనలు, అనుమతి లేని ప్రమోషన్లు వేగంగా పెరుగుతున్నాయన్నది ముఖ్యమైనది. ఇవి కేవలం ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాకుండా, నటుడి వ్యక్తిగత ప్రతిష్ఠకు కూడా తీవ్ర హానిని కలిగిస్తున్నాయని వారు వాదించారు. ఈ వాదనలను అంగీకరించిన కోర్టు, డిజిటల్ కాలంలో సెలబ్రిటీల వ్యక్తిత్వ హక్కులు అత్యంత విలువైనవని వ్యాఖ్యానించింది. ఒక ప్రముఖుడి పేరు, ఇమేజ్ కూడా వారి వ్యక్తిగత ఆస్తితో సమానమని స్పష్టం చేసింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**